

848 పొగాకు బేళ్ల విక్రయం

మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 848 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,140
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,550
3 శాతం జీఎస్టీతో	రూ.5,716
సవర (8 గ్రా)	రూ.45,728

గరిష్ఠం/కనిష్ఠం
35.6 /26.5

వాతావరణం

సోమవారం గాలిలో 51 శాతం తేమ ఉంది. మూడురోజులపాటు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



న్యూస్‌రీల్

సమాచార శాఖ డీడీగా సదారావు



మంత్రి కాకాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సదారావు

నెల్లూరు(అర్బన్): జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా కె.సదారావు సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ డివిజన్ పీఆర్వోలు, ఏపీఆర్వోలు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సదారావు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్‌ను కలిసి పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ పీఆర్వో రమేష్, ఏపీఆర్వో రవీంద్ర, పీఆర్వో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఓగా సుధాభారతి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)గా సుధాభారతి సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సోమశిలలో 52.948 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 52.948 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 365 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 1,200 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.865 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 333 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

పది పరీక్షలకు 28,001 మంది హాజరు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సోమవారం జిల్లా వ్యాప్తంగా 99.48 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 28,148 మందికి గానూ 28,001 మంది పరీక్ష రాశారు. నెల్లూరు ఆర్డీఓ మలోల రెండు, ఆర్జేడీ సాయి సుబ్బారావు ఆరు, డీఈఓ గంగాభవాని ఐదు కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు.

నేడు జ్యోతిరావు పూలే జయంతి

నెల్లూరు(అర్బన్): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత విజయమహల్‌గేట్ సమీపంలో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అధికారులందరూ సకాలంలో హాజరుకావాలని ఆదేశించారు.

కాసుల కోసం కోతలు

జిల్లాలో..

2022 ఏప్రిల్ నుంచి
2023 ఫిబ్రవరి వరకు..

ప్రైవేట్ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య : 25,020


సిజేరియన్లు : 9,007

నార్మల్ డెలివరీలు : 16,013

అవసరం లేకున్నా సిజేరియన్లు

- దృష్టంతా డబ్బుపైనే..
- ఇదీ కొన్ని ప్రైవేట్ హాస్పిటళ్ల తీరు
- ప్రభుత్వాస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం

స్త్రీకి మాతృత్వం వరం అంటారు. నవమాసాలు మోసి ప్రసవ వేదనను అనుభవించినా.. ఆ కష్టాన్నంతా కన్నబిడ్డను చూసుకుని మరచిపోతుంది.. మురిసిపోతుంది. అయితే బిడ్డకు జన్మనివ్వడం అంటే ప్రతి తల్లికి పునర్జన్మ వంటిదే. సాధారణ ప్రసవానికి వీలు కానప్పుడే సిజేరియన్ చేసి శిశువును బయటకు తీయాలి. కానీ కొందరు ప్రైవేట్ హాస్పిటళ్ల వైద్యులు అవసరం లేకపోయినా ఆపరేషన్లు చేసి సొమ్ములు మూటగట్టుకుంటున్నారు.



సాక్షి, నెల్లూరు డెస్క్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో గర్భిణులకు సుఖ ప్రసవాలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. జిల్లా కేంద్రంతోపాటు ముఖ్య పట్టణాలు, మండల కేంద్రాల్లో కూడా వైద్యశాలలున్నాయి. వాటిలో డాక్టర్లతో పాటు నర్సులు, సిబ్బంది ఉన్నారు. అన్ని వేళలా మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. నెలలు నిండిన గర్భిణులు ప్రసవానికి వైద్యశాలకు వస్తే సాధారణ ప్రసవం జరిగేలా చూడాలి. సుఖ ప్రసవానికి వీలు లేనప్పుడు మాత్రమే సిజేరియన్ చేసి బిడ్డను తీయాలి.

జరుగుతోంది ఇదే..

గర్భిణులు ఎవరైనా ప్రసవం కోసం ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్తే కొందరు డాక్టర్లు వారి నుంచి ఎంత వీలైతే అంతమేరకు డబ్బు గుంజేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన తర్వాత గర్భిణికి రకరకాల పరీక్షలు చేస్తున్నారు. రక్తం తగినంతగా లేదంటూ, ఆరోగ్యం మెరుగుపడాలంటూ పలు రకాల మందులు కొనిపిస్తున్నారు. రూ.వేలు ఖర్చు చేయిస్తున్నారు. తీరా డెలివరీ సమయం దగ్గర పడగానే సాధారణ ప్రసవానికి వీలుకాలేదంటూ సిజేరియన్ చేయాలంటున్నారు. ఆపరేషన్ చేయకపోతే తల్లీబిడ్డ ప్రాణాలకే ప్రమాదమని భయపెడుతున్నారు. దీంతో కుటుంబీకులు సిజేరియన్‌కు అంగీకరించాల్సి వస్తోంది.

సిజేరియన్‌తో నష్టాలు

బిడ్డను బయటకు తీసే సమయంలో తల్లికి ఎక్కువ రక్తస్రావం అవుతుంది. సిజేరియన్ వల్ల దీర్ఘకాలంలో వెన్నుపూస సమస్యలు, లేదా ఊబకాయం వచ్చే అవకాశం ఉంది. ఆపరేషన్ చేసి బిడ్డను తీస్తే శిశువుకు శ్వాసకోశ సమస్యలు రావొచ్చు. సిజేరియన్ గాయం వల్ల తల్లికి భవిష్యత్‌లో ఇతర సమస్యలు రావచ్చు. ఒక్కోసారి ఇన్‌ఫెక్షన్లు సోకితే తల్లికి ఎక్కువ ప్రమాదం ఉంటుంది. సాధారణ ప్రసవమైతే శిశువుకు వెంటనే తల్లిపాలు వస్తాయి. సిజేరియన్ అయితే ఆలస్యం కావచ్చు. ఒకసారి సిజేరియన్ చేస్తే రెండోసారి గర్భం దాల్చినప్పుడు మరిన్ని సమస్యలు వస్తాయి.

డబ్బు కోసం..

ప్రైవేటు నర్సింగ్ హోంల్లో చాలామంది డాక్టర్లు తల్లీబిడ్డ ఆరోగ్యం కంటే.. సొమ్ము రాబట్టుకునే ధోరణిలోనే ఆలోచన చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆస్పత్రిలో సాధారణంగా నార్మల్ డెలివరీకి రూ.10 వేలలోపే బిల్లు వేస్తారు. అదే సిజేరియన్ అయితే ఆస్పత్రి స్థాయిని బట్టి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు బిల్లు వేస్తారు. పేషెంట్‌ను మూడురోజులపాటు ఆస్పత్రిలోనే ఉంచి మందులు, రూం రెంట్, ఇతర ఖర్చులకు మరో రూ.50 వేల వరకు బిల్లు వేస్తున్నారు. అదే ప్రభుత్వాస్పత్రుల్లో అయితే నామమాత్రపు ఖర్చుతోనే సుఖ ప్రసవాలు చేయించుకోవచ్చు.

సిజేరియన్ కాన్పులతో అనారోగ్యం



నార్మల్ డెలివరీలు కాకుండా సిజేరియన్ (కోత) ఆపరేషన్ల ద్వారా కాన్పు చేస్తే తల్లి ఆరోగ్యానికి మంచిది కాదు. మొదటి దఫా సిజేరియన్ ఆపరేషన్ చేసిన వారికి రెండోసారి గర్భం వచ్చినప్పుడు సైతం సిజేరియన్ చేయాల్సి వస్తుంది. అలాంటి సమయంలో కొంతమందికి కుట్లు ఊడిపోయే ప్రమాదం ఉంది. సిజేరియన్ వల్ల ముర్రుపాలు అందక బిడ్డకు వ్యాధి నిరోధకత శక్తి తగ్గుతుంది. ఇది బిడ్డ ఎదుగుదలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రకరకాల కారణాల వల్ల 15 నుంచి 20 శాతం సిజేరియన్లు చేయాల్సి వస్తుంది. అయితే నెల్లూరు జిల్లాలో సిజేరియన్ల సంఖ్య 30 శాతం దాటింది. ఇది మంచి పద్ధతి కాదు. అందుకే సిజేరియన్ చేసిన కాన్పులపై ఆడిట్ చేస్తున్నాం. అనవసరంగా ఆపరేషన్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

నార్మల్ డెలివరీలు జరగాలి



సహజంగా గర్భిణులకు నార్మల్ డెలివరీలు చేయాలి. తప్పనిసరి పరిస్థితుల్లోనే సిజేరియన్‌లు చేయాలి. ఆపరేషన్ ద్వారా పుట్టిన బిడ్డ తెలివితేటల్లో కాస్త వెనుకబడి ఉంటారు. మానసిక ఎదుగుదలలో సైతం తేడా ఉంటుంది. ముహూర్త బలం అనో.. లేదా పురిటి నొప్పులు తెలియకూడదనో ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీయడం మంచిది కాదు. నెలలు నిండిన తర్వాత నార్మల్ డెలివరీ చేయాలి. శారీరక, మానసిక ఎదుగుదలకు ఇది అవసరం.

– డాక్టర్ రమేష్‌నాథ్, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి (డీసీహెచ్‌ఎస్)

పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తాం

- గతంలో బిల్లులకు చంద్రబాబు ఎగనామం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: రాష్ట్రంలోని పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిరదవోలు సచివాలయం పరిధిలోని పార్లపల్లి, చెర్లోపల్లి, కల్యాణపురం గ్రామాల్లో సోమవారం మంత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇళ్లకు సంబంధించిన రికార్డులను అస్తవ్యస్తం చేసినట్లు ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు మంజూరు చేసిన పక్కాగృహాలకు సంబంధించి బిల్లులను చంద్రబాబు చెల్లించకుండా ఎగనామం పెట్టినట్లు చెప్పారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను తమ ప్రభుత్వం పూర్తి చేస్తే చంద్రబాబు వచ్చి సెల్ఫీ తీసుకుని సవాల్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బాబు సీఎంగా ఉన్న సమయంలో అతితక్కువ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. అప్పట్లో అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతీదీవెన, ఆసరా, చేయూత, రైతు భరోసా, వాహనమిత్ర తదితర పథకాలు లేవన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను సైతం ఖర్చు చేయకపోవడంతో పేదవాళ్లు ఇళ్లు లేక చెట్ల కింద ఉన్నట్లు పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎస్టీలు గృహాలు నిర్మించుకునేందుకు ఒక్కో కుటుంబానికి రూ.15 వేలు అదనంగా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. పేదవాడి సొంతింటి కల సాకారం చేసేందుకు కృషి చేస్తానన్నారు. చంద్రబాబు వలే బూటకపు వాగ్దానాలు చేసి పబ్బం గడుపుకోమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిందే చేస్తారని, చేసేదే చెబుతారని గుర్తుచేశారు. మంత్రి వెంట సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, నీలి పెంచలయ్య తదితరులున్నారు.

కరోనాపై అప్రమత్తం

- నేడు పెద్దాస్పత్రిలో మాక్‌డ్రిల్
- పరీక్షల సంఖ్య పెంపు
- పెద్దాస్పత్రిలో వంద పడకల కేటాయింపు



నెల్లూరు(అర్బన్): జిల్లాలో నాలుగురోజుల నుంచి కరోనా కేసులు నమోదవుతున్నాయి. పెద్దాస్పత్రిలో నలుగురు అడ్మిట్ కాగా వారందరూ ప్రస్తుతం డిశ్చార్జ్ అయ్యారు. తాజాగా సోమవారం మరో రెండు కేసులు వెలుగు చూశాయి. వారిలో ఒకరు వేదాయపాళెం వాసి. మరొకరు స్థానిక కార్పొరేట్ వైద్యశాలలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి. జిల్లాలో రెండు యాక్టివ్ కేసులు ఉన్నందున వైద్యశాఖాధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం పెద్దాస్పత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నారు. కరోనా సోకిన వారు ఆస్పత్రికి వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆక్సిజన్, ఇతర పరికరాలు, వసతులు తదితరాలు నిబంధనల ప్రకారం ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. వైరస్ సోకిన వారి కోసం పెద్దాస్పత్రిలో ఇప్పటికే 100 పడకల గల పల్మనాలజీ బ్లాక్‌ను కేటాయించారు. ఆత్మకూరు జిల్లా ఆస్పత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆస్పత్రుల్లో సైతం 50 చొప్పున పడకలు ఏర్పాటు చేశారు. సీహెచ్‌సీల్లో ఐదేసి బెడ్స్ సిద్ధం చేశారు.

200కి పెంపు

ఇప్పటివరకు ప్రభుత్వం ర్యాండమ్‌గా రోజుకి 50 కోవిడ్ పరీక్షలు చేసేది. అయితే అక్కడక్కడా కోవిడ్ కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో పరీక్షల సంఖ్యను 50 నుంచి 200కి పెంచాలని ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కోవిడ్ కిట్లు జిల్లాకు వచ్చాయన్నారు. పరీక్షల సంఖ్యను అవసరాన్ని బట్టి ఇంకా పెంచుతామన్నారు. కోవిడ్ విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. మాస్కులు ధరించాలన్నారు. భౌతికదూరం పాటించాలన్నారు.

ఫిర్యాదులు స్వీకరించి.. భరోసా కల్పించి..



సమస్య వింటున్న ఏఎస్పీ ప్రసాద్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. 77 మంది తమ సమస్యలపై ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్‌కు ఫిర్యాదులు చేశారు. వారు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రధానంగా చిట్స్, ఉద్యోగాల పేరిట మోసాలు, అదనపు కట్నం కోసం వేధింపులు, దొంగతనం కేసుల్లో దర్యాప్తు, అత్తింటి వేధింపులు, మిస్సింగ్ కేసులపై ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ చిట్స్, ఉద్యోగాల పేరిట మోసాలు అధికమయ్యాయని వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. స్పందన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం ఫిర్యాదుదారులకు భోజనం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

రేపు డీఎస్సీ-98 అభ్యర్థులకు కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): డీఎస్సీ-98 అభ్యర్థులకు బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ జరుగుతుందని డీఈఓ గంగాభవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలియజేశారు. కౌన్సెలింగ్ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థులు రూ.100 స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్‌ను సమర్పించాలన్నారు. కౌన్సెలింగ్ అనంతరం అపాయింట్‌మెంట్ ఆర్డర్లను ఇస్తామని తెలిపారు.

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి

- ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్



సమస్యలు తెలుసుకుంటున్న కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ

నెల్లూరు(అర్బన్): స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కూర్మనాథ్ మాట్లాడుతూ కొన్నిశాఖలకు సంబంధించి ప్రజల నుంచి అర్జీలు పునరావృతం అవుతున్నాయని, ఇలా వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సకాలంలో సమస్యలను ఎందుకు పరిష్కరించలేకపోయారో అర్జీదారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ వెంకటదాస్, వ్యవసాయశాఖాధికారి సుధాకర్‌రాజు, విద్యుత్ శాఖ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్ ప్రసాద్, అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రశేఖర్‌రెడ్డి నైజం

- వైఎస్సార్ కుటుంబం వల్లే నాలుగుసార్లు ఎమ్మెల్యే అయ్యావు
- ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీకి ఆదరణ తగ్గలేదు
- పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు ధనంజయరెడ్డి



మాట్లాడుతున్న ధనంజయరెడ్డి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నమ్మిన వారిని మోసం చేయడం ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి నైజమని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు, ఉదయగిరి నియోజకవర్గ మాజీ పరిశీలకుడు కొడవలూరు ధనంజయరెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఉదయగిరి నియోజకవర్గ నేతలతో కలిసి నెల్లూరులోని ఓ ఫంక్షన్ హాల్లో మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రశేఖర్‌రెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా అయ్యారంటే అది వైఎస్సార్ కుటుంబం వల్లేనని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఆయన లేకున్నా ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తనపై ఆరోపణలు చేశారన్నారు. అయితే ఆయన చేసిన తప్పులు, ఆరోపణలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పరిశీలకుడిగా ఉదయగిరి నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో ఎమ్మెల్యే చేసిన అవినీతి, అక్రమాలు తన దృష్టికి వచ్చాయన్నారు. వాటిని పరిశీలిస్తే వాస్తవాలని తెలిసిందన్నారు. ఇంకా పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులచే తప్పుడు కేసులు పెట్టించినట్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న తాను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి కేసులు లేకుండా చేశానని చెప్పారు. అంతేకాకుండా పార్టీ పదవులు ఇప్పిస్తానని చెప్పి ఒక్కొక్కరి నుంచి డబ్బులు వసూలు చేశారని బాధితులు తన వద్ద వాపోయారన్నారు. చంద్రశేఖర్‌రెడ్డిలా తాను ఎవరి వద్ద నుంచి కూడా ఒక్కపైసా ఆశించలేదని, 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆస్తులను అమ్ముకున్నానని వెల్లడించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి పార్టీలో లేనందున ఎలాంటి నష్టం లేదన్నారు. ఆయన వెంట ఒక్క కార్యకర్త కూడా వెళ్లలేదన్నారు. అధిష్టానం ఎవరికి ఇన్‌చార్జి పదవి ఇస్తే వారి వెంటే నడుస్తామన్నారు.

శేఖరయ్యా.. నీ వసూళ్ల చిట్టా..

వింజమూరుకు చెందిన వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ నా భార్య ఎంపీటీసీగా పోటీ చేసేందుకు చంద్రశేఖర్‌రెడ్డి రూ.5 లక్షలు తీసుకున్నాడని ఆరోపించారు. పోటీలో నిలబడిన ఇతర పార్టీకి చెందిన వ్యక్తిని గెలిపిస్తానని చెప్పి అతని వద్ద కూడా రూ.5 లక్షలు తీసుకున్నాడని చెప్పారు. చివరకు నా భార్యను ఏకగ్రీవంగా గెలిపించేందుకు రూ.15 లక్షలు ఇవ్వమని అడిగాడన్నారు. వింజమూరుకు చెందిన కాంట్రాక్టర్ కొండారెడ్డి మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే నా దగ్గర రూ.40 లక్షలు తీసుకుని బీఫారాలు ఇచ్చాడన్నారు. అయితే తనకు చెందిన వారిని కాకుండా.. ఇతర పార్టీలకు చెందిన వారిని గెలిపిస్తానని రూ.3 కోట్లు వసూలు చేశాడని చెప్పారు. చంద్రశేఖర్‌రెడ్డి ప్రతి పనికి రేటు నిర్ణయించి దండుకున్నట్లు చెప్పారు. ఉదయగిరి మాజీ మండలాధ్యక్షుడు చేజర్ల సుబ్బారెడ్డి మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి 2007 నుంచి తనను మోసం చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో రూ.50 లక్షలు ఇచ్చానన్నారు. ఎమ్మెల్యే వ్యవహారమంతా పార్టీ పెద్దలకు చెప్పామన్నారు. ఉదయగిరి జెడ్పీటీసీ సభ్యుడు మోడి రామాంజనేయులు మాట్లాడుతూ ఉదయగిరి జెడ్పీటీసీ బీసీ రిజర్వ్ కావడంతో తనని జెడ్పీటీసీకి పోటీ చేయమని ఎమ్మెల్యే చెప్పారన్నారు. ఆయన అడగ్గానే రూ.25 లక్షలు ఇచ్చానన్నారు. మరోసారి అడిగితే రూ.25 లక్షలు ఇచ్చినట్లు చెప్పారు. తాను గెలిచినా బీసీనని తక్కువ చేస్తూ అవమానించారన్నారు. దుత్తలూరు ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ తరఫున ఎవరిని పెట్టినా 2024 ఎన్నికల్లో గెలిపించుకుంటామన్నారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లూరు రాజు మాట్లాడుతూ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గురించి నాయకులందరూ చెబుతున్నవి చాలా తక్కువని, ఆయన అక్రమాల చిట్టా అంతా ఇంతా కాదన్నారు. ధనంజయరెడ్డి నియోజకవర్గంలో తిరిగి పార్టీని బలోపేతం చేశారని చెప్పారు. తూర్పుపాళెం సర్పంచ్ మాల కొండయ్య మాట్లాడుతూ కొండాపురం మండలంలో మొత్తం 880 ఎకరాల్లో రైతులు పంటలు వేసుకున్నారని, చెరువుల నుంచి నీరు ఇప్పించాలని ఎమ్మెల్యేకి అనేకసార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. చివరికి తాను ధనంజయరెడ్డికి చెబితే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలియజేశారు. వింజమూరు జెడ్పీటీసీ సభ్యుడు బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి గెలుపు కోసం ఎంతో కష్టపడి పనిచేశామని, అయితే ఆయన అందరిని మోసం చేశాడన్నారు. ఎమ్మెల్యేని సీఎం జగన్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో ప్రజలంతా ఆనందంగా ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో సీతారామపురం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, లంకా రామశివారెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, పాముల రమణయ్య, చేజర్ల చలమారెడ్డి, అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, గువ్వల కృష్ణారెడ్డి, గణపం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీల్డ్ టెండర్ల నిర్వహణ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ అంశాలకు మంగళవారం సీల్డ్ టెండర్లు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు సోమవారం తెలిపారు. మే 10 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి విద్యుద్దీపాలంకరణ, డ్రామా స్టేజ్, బ్యారికేడ్లు, కల్యాణం స్టేజ్ ఏర్పాటు, వంటపాత్రల సరఫరా, ఆలయానికి రంగులు వేయడం, ఫ్లెక్సీల ఏర్పాటు, ఫొటోలు, వీడియో తియ్యడం, క్లాత్ పందిర్లు వేయడానికి సీల్డ్ టెండర్లను నిర్వహిస్తామని తెలిపారు.

ప్రతి గడపకు వెళ్లడం చరిత్రలో మొదటిసారి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: ఎమ్మెల్యేలు ప్రతి గడపకు వెళ్లడం చరిత్రలోనే మొదటిసారి అని, ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో మూడో రోజు సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, అయితే ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రభుత్వంపై అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని, దీనిని చూసి ఓర్వలేని ఈ ముగ్గురు ముఖ్యమంత్రిపై నిందలు వేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు ఉండబట్టే 151 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారని గుర్తుచేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరలా సీఎంను చేసేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీపీ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గతంలో ఇళ్లు గోడలకే పరిమితం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: గత ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లు పూర్తిస్థాయిలో నిర్మాణాలు కాక కొన్నిచోట్ల కేవలం గోడలకే పరిమితమయ్యాయని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించిందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో సోమవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం చంద్రబాబు సెల్ఫీలతో ఛాలెంజ్ చేయడం సరికాదని, ఆ ఛాలెంజ్ స్వీకరించిన మంత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సరైన జవాబు ఇచ్చారని తెలిపారు. అరకొర నిర్మాణాలపై సెల్ఫీ ఏమిటని వ్యాఖ్యానించారు. ముందస్తు ఎన్నికలు ఎట్టి పరిస్థితుల్లోనూ రావని, వచ్చే ఏడాదిలో సాధారణ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్.. తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవరత్నాల పథకాలు ప్రజల అభ్యున్నతికి దోహదపడతాయన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు



నెల్లూరు నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీలో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా తన ఇంటికి అతికించిన స్టిక్కర్‌ను చూస్తున్న ముస్లిం మహిళ – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

మోపెడ్‌ను ఢీకొన్న కారు

- దంపతులకు గాయాలు



గాయపడిన చెన్నారెడ్డి

కలిగిరి: టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్న దంపతులను వెనుక నుంచి కారు ఢీకొనడంతో గాయపడ్డారు. ఈ ఘటన కావలిరోడ్డులోని స్థానిక మాలతీస్కూల్ సమీపంలో సోమవారం జరిగింది. బాధితుల సమాచారం మేరకు.. కలిగిరికి చెందిన బొడ్డు చెన్నారెడ్డి, పద్మజ దంపతులు మోపెడ్‌పై పొలానికి వెళుతున్నారు. పులివెందుల నుంచి కావలి వైపు వేగంగా వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చెన్నారెడ్డికి కాలు విరిగి తీవ్ర గాయాలు కాగా, భార్య పద్మజ స్వల్ప గాయాలతో బయట పడింది. చెన్నారెడ్డిని ప్రమాదానికి కారణమైన కారులోనే కావలికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైకు తరలించారు.

విజయారావుకు ఘన వీడ్కోలు



ఎస్పీని, ఆయన కుటుంబాన్ని పూల వాహనంలో లాక్కుంటూ వెళుతున్న పోలీసు అధికారులు

నెల్లూరు(క్రైమ్): ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీపై వెళుతున్న ఎస్పీ సీహెచ్ విజయారావుకు సోమవారం పోలీసు కవాతు మైదానంలో అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఏఆర్, స్పెషల్ పార్టీ, ట్రాఫిక్ పోలీసులు వీడ్కోలు కవాతు నిర్వహించగా వారి నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది గౌరవ సూచకంగా ఎస్పీని, ఆయన కుటుంబాన్ని పూల వాహనంలో పోలీసు అతిథిగృహం నుంచి క్యాంపు కార్యాలయం వరకు లాగారు. తొలుత సీహెచ్ విజయారావు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. సిబ్బంది పనితీరు భేష్‌గా ఉందన్నారు. విధి నిర్వహణతోపాటు సిబ్బంది ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీగా విధినిర్వహణ ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. సిబ్బంది అందించిన సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. కవాతును అద్భుతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం పోలీసు అధికారులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, పి.వీరాంజనేయరెడ్డి, అబ్దుల్‌సుభాన్, సురేష్, గాంధీ, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 848 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 848 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 897 బేళ్లు రాగా వాటిలో 848 బేళ్లను విక్రయించామని, మిగిలిన 49 బేళ్లలో 17 నోసేల్, 12 నోబిడ్, 20 సీఆర్‌గా గుర్తించామని తెలిపారు. వేలంలో 1,15,771 కిలోల పొగాకు విక్రయించగా రూ.2,27,34,351 వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలోకు రూ.200 పలకగా కనిష్ట ధర రూ.180 లభించింది. సగటు ధర కిలోకు రూ.196.37గా నమోదైంది.

పది పరీక్ష కేంద్రాల్లో వసతులు భేష్

- ఆర్జేడీ సుబ్బారావు



జగనన్న విద్యాకానుక కిట్ల స్టోరేజ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్జేడీ సుబ్బారావు

ఉదయగిరి: జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో వసతులు భేష్‌గా ఉండడంతో విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాస్తున్నారని ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు తెలిపారు. సోమవారం ఉదయగిరి ప్రాంతంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్ల సరఫరాకు ఏర్పాటు చేయనున్న స్టాక్ పాయింట్ గదులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగడం లేదన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధించడం వల్ల పరీక్ష ప్రశ్నపత్రం బయటకు రాకుండా అరికట్టగలిగామన్నారు.

పాఠశాలల పునఃప్రారంభం నాటికి కిట్లు

జగనన్న విద్యాకానుక కిట్లను పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ జిల్లా నోడల్ అధికారి సుబ్బారావు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 15 మండలాల్లో స్టాక్ పాయింట్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చామన్నారు. మే 31వ తేదీ నాటికి కిట్లు ఆయా పంపిణీ కేంద్రాలకు చేరుతాయన్నారు. వస్తువులను పరిశీలించేందుకు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందంలో మండల ఇంజినీర్, ఏపీఎం ఉంటారన్నారు. ప్రతి విద్యార్థికి జగనన్న విద్యాకానుక కిట్ అందేలా చూస్తామన్నారు. ఆయన వెంట జిల్లా డైట్ కళాశాల వ్యాయామ అధ్యాపకుడు మహబూబ్‌బాషా, ఎంఈఓ మస్తాన్‌వలి ఉన్నారు.

అక్కాతమ్ముడిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో అక్కాతమ్ముడిపై కొందరు హత్యాయత్నం చేసిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు వనంతోపు సెంటర్‌లో శివమణి కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన మార్బుల్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడాది క్రితం అదే ప్రాంతానికి చెందిన తిరుపాల్‌తో గొడవపడ్డాడు. అప్పటి నుంచి తిరుపాల్ అతనిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 7వ తేదీన మద్యం తాగిన తిరుపాల్ పాత విషయాలను మనస్సులో పెట్టుకుని శివమణితో గొడవపడి అతని మొహంపై ఉమ్మి వేశాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం శివమణి తన అక్క జాహ్నవితో కలిసి ఇంటి ముందు టిఫిన్ సెంటర్ వద్ద నిలబడి ఉండగా తిరుపాల్ వనంతోపు సెంటర్‌కు చెందిన అతని స్నేహితులు ప్రకాష్, పెంచలయ్యలతో కలిసి అక్కడకు వచ్చాడు. కూరగాయలు తరిగే కత్తితో శివమణి వీపుపై పొడిచారు. అడ్డువచ్చిన జాహ్నవిపై సైతం కత్తితో దాడి చేశారు. స్థానికులు రావడాన్ని గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. గాయాల పాలైన శివమణి, జాహ్నవి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు బాధితులు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్లోంచి జారిపడి వ్యక్తి మృతి



కావలిరూరల్: చెన్నై వైపు వెళ్లే రైల్వే ఎగువ లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం తలమంచి వద్ద చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై అరుణకుమారి తెలిపిన వివరాల మేరకు కావలి రైల్వేస్టేషన్ పరిధిలోని తలమంచి వద్ద రైల్వే ఎగువ లైన్‌లో సుమారు 30–35 ఏళ్ల లోపు వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి రైల్లోంచి జారిపడి మృతిచెందాడు. అతనికి కుడిచెయ్యి లేదు. అతని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.35

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్ :	రూ.103
లేయర్ లైవ్	రూ.75
బ్రాయిలర్ చికెన్:	రూ.184
స్కిన్‌లెస్ చికెన్:	రూ.206
లేయర్ చికెన్:	రూ.128

బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు గాయపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఒక యువకుడు తన స్నేహితుడిని పదో తరగతి పరీక్షల నిమిత్తం బైక్‌పై రేబాలలోని సెయింట్ థామస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో వదిలి తిరిగి బుచ్చిరెడ్డిపాళేనికి వస్తున్నాడు. అదే సమయంలో బుచ్చిరెడ్డిపాళెం నుంచి నెల్లూరు వైపు వెళుతున్న మరో బైక్ ఇతని బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై ఉన్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. వీరిలో ఒకరికి తీవ్రగాయాలు కావడంతో నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సిఉంది. అయితే ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.